క్లుప్తంగా

ఇంటి స్థలాల కోసం వినతి


తహసీల్దార్ శ్రీదేవికి విన్నవిస్తున్న గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో ఈబీసీ కాలనీలోని గిరిజనులు సోమవారం ఇంటి స్థలాల కోసం తహసీల్దార్ శ్రీదేవికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటమ్మ మాట్లాడుతూ ఇంటి స్థలాలు లేకపోవటంతో ఒకే ఇంట్లో మూడు కుటుంబాలు నివసిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలు లేని వారికి స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మండల సీపీఐ కార్యదర్శి కత్తిధర్మయ్య, గిరిజనులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. ఆమె సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలసి ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, డీటీ చంద్రబాబు నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య, ఏఓ భారతి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వీఆర్‌ఓపై ఫిర్యాదు


వీఆర్‌ఓ తేజారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు గ్రామానికి చెందిన అనూష భూ సమస్యను రెండేళ్లుగా వీఆర్‌ఓ తేజారెడ్డి పరిష్కరించకుండా ఇబ్బంది పెడుతున్నట్లు సోమవారం తహసీల్దారు శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. భాగ పరిష్కారంలో భాగంగా భూమిని తమ పేరుపై బదలాయించాలని పలు మార్లు వినతులు సమర్పించినా పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై స్పందించిన తహసీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ భూసమస్యలపై అలసత్వం ప్రదర్శిస్తే ఊరుకోనని, సమస్యలపై స్పందించకుంటే చర్యలు తప్పవని వీఆర్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నివాళి


చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీర్ల చావిడివీధిలో కలపాటి చంద్రశేఖర్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పార్టీ నాయకులు సాధన మున్నా రాయల్, సురేష్, శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, విజయకుమార్ రెడ్డి తదితరులున్నారు.

బోరు మోటారు స్టార్టర్ చోరీపై ఫిర్యాదు


స్టార్టర్ చోరీతో ఖాళీగా ఉన్న బాక్సు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలో ఉన్న బోరు మోటారు స్టార్టర్ చోరీకి గురైందని సోమవారం సర్పంచ్ రమణమ్మ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని తాగునీటి బోరు మోటార్ల స్టార్టర్లను దుండగులు చోరీ చేస్తున్నారని తెలిపారు. దీంతో మోటార్లు పనిచేయకపోవడంతో నీటిని కోసం గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పలుమార్లు స్టార్టర్లు చోరీకి గురై అయ్యాయని, పోలీసులు స్పందించి దుండగులను పట్టుకుని, చోరీలు జగరకుండా చూడాలని కోరారు.

ఉపాధి కూలీలకు అండగా జీవిత బీమా

- అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వం
- సత్యవేడు నియోజకవర్గంలో 33173 మంది కూలీలు
- ప్రమాదం, సహజ మరణానికి రూ.రెండు లక్షలు
- జాబ్ కార్డు ఉన్న వారికి వర్తించేలా చర్యలు


వరదయ్యపాళెం మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

వరదయ్యపాళెం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఇప్పటి వరకు జీవిత బీమా సౌకర్యం లేదు. ఈ నేపథ్యంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి బీమా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. గ్రామీణ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు సత్యవేడు నియోజకవర్గంలో ఉన్న 33,173 మంది కూలీలకు బీమా సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎఫ్ఏ లేదా మేట్ అందజేసే దరఖాస్తుపై కూలీలు సంతకం పెట్టి అప్పగిస్తే బ్యాంకు ఖాతాల నుంచి ప్రీమియం మినహాయించుకుంటారని అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే ఈ పథకం వర్తింప చేసుకునేందుకు కూలీలు చొరవ చూపి అధికారులకు సహకరించాల్సి ఉంది.

బీమాలో రెండు రకాలు

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన కింద బీమా భరోసాను కల్పించాలని కార్యాచరణ రూపొందించింది. మొదటి బీమా ప్రీమియం కింద ఏడాదికి రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. ప్రమాదవశాత్తు కూలీ మృతి చెందితే రూ.2 లక్షలు ఇస్తారు. రెండో దానికి సంబంధించి ప్రీమియం రూ.436 చెల్లించాలి. సహజ మరణం లేదా ప్రమాదం జరిగి మృతి చెందితే రూ.2 లక్షలు ఇస్తారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించి అందరికీ బీమా పథకం వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

కూలీల కుటుంబాలకు అండగా బీమా

ప్రస్తుతం వేసవి నేపథ్యంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. కూలీల్లో వయసు మళ్లిన వారు, ఆరోగ్య సమస్యలున్న వారు అనేక మంది ఉంటారు. దీని కారణంగా వేసవి దృష్ట్యా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ప్రధానంగా వడదెబ్బ ప్రభావం, ఇతర కారణాలతో మృతి చెందితే బీమా వర్తిస్తుంది. ఫలితంగా వారి కుటుంబాలకు నగదు సాయం ఆసరాగా ఉంటుందని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీ బీమా ప్రీమియం చెల్లించాలని కోరుతున్నారు. రెండు రకాల బీమా పథకాలను కూలీలు పొందాలని సూచించారు. దీనిపై మండలాల్లో సమావేశాలు పెట్టి అవగాహన కల్పిస్తున్నారు. మండే ఎండల వల్ల ఉపాధి పనులకు సైతం కూలీలు సక్రమంగా వెళ్లడం లేదు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా 15వేల మంది మాత్రమే పనులకు హాజరవుతున్నట్లు సమాచారం. ప్రధానంగా నియోజకవర్గం పరిధిలోని సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లో పరిశ్రమలు ఉన్న కారణంగా ఎక్కువ మంది ఉపాధి పనులకు హాజరు కావడం లేదు. దీని కారణంగా నియోజకవర్గంలో అనుకున్న స్థాయిలో ఉపాధి పనులు కూడా జరగడం లేదు.

మండలాలవారీగా ఉపాధి కూలీల వివరాలు

మండలం	జాబ్ కార్డులు	కూలీలు
వరదయ్యపాళెం	7305	5707
బీఎన్‌కండ్రిగ	7690	1200
కేవీబీపురం	9224	2200
నారాయణవనం	7424	1613
పిచ్చాటూరు	6207	10750
నాగలాపురం	5969	9551
సత్యవేడు	7875	2152

జీవిత బీమా సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ఉపాధి కూలీలు విధిగా బీమా సౌకర్యం పొందాలి. బ్యాంక్ ఖాతాల నుంచి ప్రీమియం మినహాయించుకుంటారు. ఎవరికీ నేరుగా నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదు. కూలీలు సహకరించాలి.

–గణేష్, ఏపీఓ, వరదయ్యపాళెం

రూ.11.95 లక్షల ఎంపీ నిధులు విడుదల

నారాయణవనం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన వీధి దీపాలకు తిరుపతి ఎంపీ నిధుల నుంచి రూ.11.95 లక్షలు విడుదలైనట్లు ఎంపీపీ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ తొలివిడతగా ఎంపీ నిధులతో వీధి దీపాలను 15 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు ఏర్పాటు చేశారని అన్నారు. విడుదలైన నిధులను సోమవారం సర్పంచ్‌లకు చెక్కుల రూపంలో అందజేశామని ఆయన తెలిపారు. మిగిలిన 4 పంచాయతీలకు రెండో విడతలో విడుదల చేయిస్తామని ఎంపీ గురుమూర్తి హామీ ఇచ్చినట్లు దివాకర్‌రెడ్డి తెలిపారు.

నేడు పాపానాయుడుపేటలో ఉచిత వైద్య శిబిరం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రాస్ వ్యవస్థాపక కార్యదర్శి, అధ్యక్షులు డాక్టర్ గుత్తా మునిరత్నం 4వ వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలోని రాస్ సేవా నిలయంలో ఉచిత కంటి, వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం తెలిపారు. వాసన్ ఐ కేర్, నారాయణాద్రి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి కంటి ఆపరేషన్లు చేస్తారని, అలాగే సాధారణ శిబిరంలో మధుమేహం, రక్తపోటు, ఈసీజీ మొదలైన పరీక్షలను నిర్వహించి మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కంటి వైద్య శిబిరానికి వచ్చేవారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులను తీసుకురావాలని కోరారు.

ఉర్దూ స్కూల్‌ను విలీనం చేయొద్దు సార్..!

- కలెక్టర్‌కు ముస్లిం మైనారిటీల మతపెద్దల వినతి


జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రేణిగుంట ముస్లిం నాయకులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఇతర పాఠశాలలకు బదిలీ చేయకూడదని సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కోరినట్లు రేణిగుంట ముస్లిం మైనారిటీ మత పెద్దలు తెలిపారు. రేణిగుంటలో 35 శాతం మంది ముస్లిం మైనారిటీ పిల్లల చదువుల కోసం ఉర్దూ పాఠశాలను ఏర్పాటుచేసి రూ.26 లక్షలతో శాశ్వత భవనం నిర్మించారు. ఉర్దూ పాఠశాలను విలీనం చేయకుండా కొనసాగించాలని కోరుతూ మాజీ ఉపసర్పంచ్ జీకే.మునీర్ ఆధ్వర్యంలోని మత పెద్దలు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీని సమర్పించారు. వారు మాట్లాడుతూ, గతంలో ఉర్దూ పాఠశాలలో 70 మంది విద్యార్థులతో ఎనిమిది తరగతులు నిర్వహించేవారని, ప్రస్తుతం విద్యార్థుల తగ్గిందనే నెపంతో ఉర్దూ విద్యార్థులను తెలుగు ఆదర్శ పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. ముస్లిం మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉర్దూ పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు నయబ్ రసూల్, షేక్ ఖాసీం పీర్జా, మొహమ్మద్ రహంతుల్లా, మహబూబ్ బాషా, ఖలీల్ సాహెబ్, అలీ, మస్తాన్, బాషా భాయ్, జిలానీ బాషా, అఫ్రోజ్, అబ్దుల్ కరీం, వార్డు సభ్యు లు వీ.మహబూబ్ బాషా పాల్గొన్నారు.

15 నుంచి చదరంగ శిక్షణ శిబిరం

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన ద చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ సంస్థ 25 ఏళ్ల పూర్తి చేసుకోవడంతో ముత్యాలమ్మ గుడివీధిలోని సరస్వతి శిశుమందిర్‌లో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు ఉచిత చదరంగ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు, కార్యదర్శి సురేష్‌బాబు, శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించి అనంతరం అండర్–7, అండర్–9, అండర్–11, అండర్–13, అండర్–15 పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు 9866381262, 9866667962 సెల్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీలో ఖాళీల భర్తీ చేయండి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

సత్యవేడు: ఆర్టీసీలో ఖాళీల భర్తీతోపాటు ప్రమోషన్లు త్వరితగతిన ఇవ్వాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ సత్యవేడు డిపో సెక్రటరీ వి.బాబు కోరారు. ఆర్టీసీ కార్మికులు డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సోమవారం రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కోసం సర్క్యులర్ అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని చెప్పారు. అనారోగ్యానికి గురైన ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు పార్థసారథి, గ్యారేజ్ అధ్యక్షుడు జి.కుప్పయ్య, సెక్రటరీ ఎస్.శేఖర్, సీసీఎస్ డిలిగేట్ జీ.సురేష్, మునిరామయ్య, ఎంఆర్ రవికుమార్, పి.వాసుదేవయ్య, కోదండయ్య, డి.అహ్మద్ ఆలీ, ఎస్.సుబ్రమణ్యం రాజు, వెంకటేశ్వర్లు, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను చేర్పించాలి


విద్యార్థుల ఇంటి వద్ద కరపత్రాలు ఇస్తున్న ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్


బడిబయట పిల్లలతో ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం నెలవాయి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించారు. వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు పురుషోత్తం, సీఆర్‌పీ ఈశ్వరమ్మ, పాల్గొన్నారు.

బడి పిలుస్తోంది

బడిఈడు పిల్లలతోపాటు 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను 6వ తరగతిలో మన బడిలో చేర్పించాలని సోమవారం కల్లివెట్టు ఉన్నత పాఠశాల పరిధిలోని కల్లివెట్టు, తలారివెట్టు గ్రామాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులు సాధించిన మార్కులు, విద్యాబోధన, మౌళిక వసతుల గురించి కరపత్రాలు అందిస్తూ ప్రచారం చేశారు.

ఏనుగుల నుంచి కాపాడండి


బాధిత రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మామండూరు మామిడి తోటలపై ఏనుగులు పడి నాశనం చేస్తున్నాయని, వాటి బారి నుంచి పంటలను, రైతులను కాపాడాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుమూరు హేమలత డిమాండ్ చేశారు. రేణిగుంట మండలం మామండూరులో ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి తోటలను సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడు రంగయ్య, కార్యదర్శి హేమలత, సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, రూరల్ కార్యదర్శి సెల్వరాజ్ పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి తెలుసుకున్నారు. ఏనుగుల కట్టడికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో బాధితులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నందివాహన సేవలో అగస్త్రీశ్వరుడు


నంది వాహనంపై అగస్త్రీశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్రీశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నందివాహనాన్ని అధిరోహించిన ఉత్సవర్లు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఉదయం నిత్యపూజాది కార్యక్రమాలను, ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు సుందరంగా అలంకరించుకుని నందివాహనాన్ని అధిరోహించారు. మేళ తాళాల మధ్య స్వామి వారు సముదాయం వీధుల్లో విహరిస్తూ హారతులను అందుకున్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఆలయాల ఏఈవో రవి, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, గౌతం గురుకుల్ పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో మంగళవారం సాయంత్రం అగస్త్రీశ్వరస్వామి గజవాహనంపై ఊరేగనున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందివ్వండి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం: గ్రామీణ ప్రాంత వాసులకు మెరుగైన వైద్య సేవలను విలేజ్ క్లినిక్‌తో అందివ్వాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని అరణ్యంకండ్రిగ సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించిన హెల్త్ క్లినిక్ ప్రారంభం కాలేదు. ఏడాదిన్నర తరువాత సోమవారం ఆ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు పుత్తూరు– నాగలాపురం రోడ్డు నుంచి అరణ్యకండ్రిగ వరకు రూ.8 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. తహసీల్దార్ జయరామయ్య, ఎంపీడీవో గుణశేఖర్, మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ కబ్జా పర్వం!

- అడ్డుకున్న ఆటో డ్రైవర్లు
- ఎమ్మెల్యే, కమిషనర్ పర్మిషన్ ఇచ్చారంటూ ఆర్‌ఎంపీ ఓవరాక్షన్


గుంతలు లోడిన దృశ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పరిధిలో రాములవారి ఆలయం పక్కనే స్థలం కబ్జాకు గురవుతున్నా ఆలయ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ ఓ ఆర్‌ఎంపీ రాత్రికి రాత్రే జేసీబీలో కట్రాళ్లను లోడించి నిర్మాణం ప్రారంభించారు. దీనిని స్థానిక ఆటో డ్రైవర్లు అడ్డుకున్నారు. ఇది ఆటోస్టాండ్ కోసం కేటాయించిన స్థలం అని చెప్పడంతో ఆ ఆర్‌ఎంపీ వారిపై విరుచుకుపడ్డాడు. తనకు ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ అనుమతి ఇచ్చారని, మళ్లీ ఇక్కడికి వస్తే కేసులు పెడతానని బెదిరించాడు. అధికారులు జోక్యం చేసుకుని స్థలాన్ని కాపాడాలని ఆటో డ్రైవర్లు, సీపీఐ నాయకుడు గోపి కోరారు.

ఈఓ ఏకపక్ష ధోరణికి నిరసన

- పంచాయతీ సమావేశం బహిష్కరణ
- నేలపై వార్డు సభ్యుల బైఠాయింపు


పాలకవర్గం సమావేశంలో నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు సభ్యులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మేజర్ పంచాయతీ పాలకవర్గం సమావేశం రసాభాసగా సాగింది. ఈఓ మణి ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని నిరసిస్తూ వార్డు సభ్యులు ఫైర్ అయ్యారు. పంచాయతీ పాలకవర్గ సమావేశం సోమవారం సర్పంచ్ నగేషం అధ్యక్షతన నిర్వహించారు. వార్డు సభ్యులు పంచాయతీ ఈఓపై ధ్వజమెత్తారు. తమకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని నిరసన వ్యక్తం చేస్తూ నేలపై బైఠాయించారు. తాము చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. అజెండాలోని అంశాలు ఎన్నడూ లేని విధంగా ఇంగ్లిష్‌లో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులను చెల్లిస్తేనే సమావేశంలో ఉంటామని తేల్చి చెప్పారు. ఈఓ సరైన సమాధానం చెప్పకపోవడంతో సమావేశాన్ని వారు బహిష్కరించారు. ఈఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పంచాయతీ తీర్మానం లేకుండా ఈఓ అధికార పార్టీ నాయకులతో కలిసి విచ్చలవిడిగా పంచాయతీలో పనులు చేస్తున్నారని, వారు చేసిన పనులకు ఆమోదం తెలిపేందుకు ప్రస్తుతం పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. తాము చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా వేధిస్తున్నారని, ఆయన తీరు రాజకీయ నాయకుల కన్నా ఘోరంగా ఉందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇర్ఫాన్, వార్డు సభ్యులు షేక్ మహమ్మద్ రసూల్, ఇరానీ ఖాదర్, వెంకటరమణ, మహమ్మద్ బాషా, కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు గంగ నీళ్లు బంద్


రేణిగుంట ఫ్లైఓవర్ వద్ద పైపులైనుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పంచాయతీకి ప్రధాన నీటి వనరుగా ఉన్న తెలుగు గంగ పైపులైన్లు డ్యామేజ్ కారణంగా రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని సిబ్బంది తెలిపారు. రేణిగుంట పంచాయతీలోని నక్కల కాలనీ వద్ద జరుగుతున్న రైల్వే వంతెన పనుల వల్ల శ్రీకాళహస్తి నుంచి వచ్చే తెలుగు గంగ నీళ్లను రెండు రోజులపాటు నిలుపుదల చేశారు. తిరుపతి నుంచి వచ్చే తెలుగు పైప్ లైన్ నాలుగు చోట్ల పైపులు దెబ్బతినడంతో పంచాయతీ నీటి సరఫరా సిబ్బంది మరమ్మతులకు పూనుకున్నారు.

ప్రాథమిక పాఠశాలల వ్యవస్థకు విఘాతం కలిగించొద్దు


ఆందోళన చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల వ్యవస్థకు విఘాతం కలిగించరాదని ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీటీఎఫ్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు కొనసాగుతున్న చోట్ల 6, 7 తరగతులు ఉన్న పాఠశాలల్లో 5 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6, 7, 8వ తరగతులు ఉన్న చోట 6 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కొనసాగించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు వెంకటాద్రి, సుధాకర్, భువనేశ్వరి, నీరజమ్మ, జ్యోతి, లక్ష్మమ్మ, సుమలత, లక్ష్మి, గోపాల్, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుల ఊపిరి కార్ల్ మార్క్స్


రేణిగుంటలో నివాళులు అర్పిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి: ప్రపంచ కార్మికుల ఊపిరి, కమ్యూనిస్టు పితామహుడు కార్ల్ మార్క్స్ అని సీపీఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం కార్ల్ మార్క్స్ 207వ జయంతిని నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్మిక వర్గాన్ని దోపిడీ నుంచి విముక్తి చేసే సిద్ధాంతాన్ని మార్క్స్ ప్రకటించారని, పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటం చేశారన్నారు. సమాజంలో ధనిక, పేదల మధ్య అంతరాలు తగ్గించేందుకు మార్క్సిజం ఉపయోగపడుతుందన్నారు. నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, రాపూరు సుబ్రమణ్యం, రాధమ్మ, ఈశ్వరయ్య, నాగరాజు పాల్గొన్నారు.

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి కందారపు మురళి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ, 19 వ శతాబ్దంలో జర్మనీకి చెందిన తత్వవేత్త కార్ల్ మార్క్స్ చాలా గ్రంథాలు రాసారని, కానీ ఆయన రాసిన వాటిలో 'కమ్యూనిస్టు ప్రణాళిక', 'పెట్టుబడి' పుస్తకాలు ఒక సమయంలో ప్రపంచంలోని చాలా దేశాల్లోని కోట్లాది మంది ప్రజలపై ఇవి రాజకీయంగా, ఆర్థికంగా చాలా ప్రభావం చూపాయని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, తిరుపతి నగర కార్యదర్శి వేణుగోపాల్, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్, కరీముల్లా, రంగయ్య, దిలీప్ బాషా, పట్టణ కార్యదర్శి ఈశ్వరమ్మ, రూరల్ కార్యదర్శి సెల్వరాజ్, సత్య శ్రీ, శివానందం పాల్గొన్నారు.

డ్రైనేజీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడయ్యా స్వామీ..!

–కమిషనర్‌కు అంజూరు వినతి


కాలువను పరిశీలిస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో డ్రైనేజీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆయన నాలుగు మాడవీధుల్లో మురుగు కాలువలను పరిశీలించి మాట్లాడారు. పట్టణ నడిబొడ్డులో నాలుగు మాడవీధుల్లో కాలువలను వారానికోసారో పదిరోజులకోసారో శుభ్రం చేస్తుండడంతో కాలువల్లో చెత్తాచెదారం నిండిపోయి మురుగు నీరు వీధుల్లో పారుతూ కంపు కొడుతోందని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై పారిశుధ్య కార్మికులను ఆయన ఆయన ప్రశ్నించారు. సిబ్బంది కొరత కారణంగా రోజూ కాలువలను శుభ్రం చేయలేకపోతున్నట్టు వారు ఆయనకు చెప్పారు. నాలుగు మాడవీధుల్లోనే ఇంత అధ్వానంగా ఉంటే ఇక మారుమూల ప్రాంతాల్లో పారిశుధ్యం ఎంత ఘోరంగా ఉంటోందో ఇట్టే తెలుస్తోందని, కమిషనర్ దీనిపై దృష్టి సారించి నాలుగు మాడవీధులలో లోపల, బయట స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పూడిక తీయించాలని కోరారు. ఈ మాజీ కౌన్సిలర్ ఉత్తరాది శరవణ కుమార్, కంటా ఉదయ్ కుమార్, నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.